వివాహిత అదృశ్యం

స్వర్ణలత

అడ్డగుట్ట, మార్చి 16: ఇంట్లో నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన స్వర్ణలత (36) క్రాంతి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. స్వర్ణలత మల్కాజ్‌గిరిలోని రాఘవేంద్ర హోటల్ పనిచేస్తుంది. ఇదిలా ఉండగా ఈ నెల 15న యధావిధిగా హోటల్‌కు పనికి వెళ్లింది. అయితే స్వర్ణలత వెళ్లిన కొన్ని గంటలకు హోటల్ నుంచి ఆమె తల్లి మనీబాయికి ఫోన్ వచ్చింది. స్వర్ణలత ఇంకా పనికి రాలేదని వారు అడగడంతో మణిబాయి కంగారు పడింది. దీంతో తుకారాం గేట్ పోలీసులకు మనీబాయి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

సైఫ్ షరీఫ్

అడ్డగుట్ట, మార్చి 16: ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుకారాం గేట్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సైఫ్ షరీఫ్ (25) సరాహు దివాన్‌తో మూడేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఈ నెల 6న స్నేహితుడి వద్ద నుంచి డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లిన షరీఫ్ తిరిగి రాలేదు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన దివాన్ బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసింది. ఫలితం లేకపోవడంతో తుకారాం గేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

సమాజ సేవలు అభినందనీయం

- వయోధికులను అభినందించిన సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్
- సేవా ట్రస్టుకు రూ.10లక్షలు అందజేత

ఎమ్మెల్యే తలసాని చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న డి.పార్థసారథి

అమీర్‌పేట్, మార్చి 16: రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి నేతృత్వంలో కొనసాగుతున్న శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు బ్రహ్మరథం పడుతుండడం అభినందనీయమని సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఓవైపు వయోభారం ఇబ్బందులు పెడుతున్నా.. సామాజిక సేవా కార్యక్రమాల పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ ఎస్సార్‌నగర్‌లోని వయోధిక సంఘం ప్రతినిధులు నిర్వహిస్తున్న తమ బాధ్యతలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి, ఆస్టర్ డీఎం ఫౌండేషన్ వారు ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామాజిక సేవలను గుర్తిస్తూ కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకంలో భాగంగా ట్రస్ట్‌కు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఆదివారం ఉదయం ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆస్టర్ డీఎం ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుష్మ, డాక్టర్ రవి శంకర్‌తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రూ.10 లక్షల చెక్కును ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డీ పార్థసారథికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారితో పాటు ట్రస్టు ప్రతినిధులు మాణిక్ రావు పాటిల్, బిచ్చప్ప, ఎస్ ఆర్ నగర్ వయోధికుల మండలి ప్రధాన కార్యదర్శి కృష్ణదేవ్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్ రెడ్డి, ఎం.హనుమంతరావు, కూతురు నరసింహ, దాడి ప్రవీణ్ రెడ్డి, వడ్డే కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల అంశంపై అసెంబ్లీలో చర్చించాలి


తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యే పద్మారావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

సికింద్రాబాద్, మార్చి16: ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లురి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ మంజూరు చేస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ నేటి వరకు ప్రారంభించలేదని, అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల హామీల అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వం నుంచి అమలు కోసం స్పష్టమైన ప్రకటన ముఖ్యమంత్రి ప్రకటించే విధంగా కృషి చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే పద్మారావును టకారబస్తీలోని వారి నివాసంలో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ దయానంద్, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఆర్కే భూపాల్, గ్రేటర్ సభ్యులు జగన్ యాదవ్, 1969 ఉద్యమకారుడు శివకుమార్, స్థానిక ఉద్యమకారులు గౌడ్ శ్రీను, టీవీ శ్రీను, లాల, లలిత, పోచమ్మ, జాన్సమ్మ తదితరులు పాల్గొన్నారు..

మాంగ్ గరోడి రాష్ట్ర నూతన కార్యవర్గం

నూతన అధ్యక్షుడు సనాధన్‌కు జ్ఞాప్తికను అందజేస్తున్న సమితి జాతీయ అధ్యక్షుడు వెంకటేష్

అడ్డగుట్ట, మార్చి 16: మాంగ్ గరోడి సమాజ్ హక్కుల సాధనలో 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అండగా ఉంటుందని సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేష్ అన్నారు. ఆదివారం తుకారం గేట్‌లోని మరాఠా బస్తీలో తెలంగాణ మాంగ్ గరోడి ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉపాదే సనాధన్, ప్రధాన కార్యదర్శి సకత్ అరుణ్‌లాల్, కమిటీ సభ్యులతో వెంకటేష్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 50 వేలకు పైగా ఉన్న మాంగ్ ప్రజలకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు కూడా తహసీల్దార్ ద్వారా ఇచ్చే విధంగా చూడాలని ఆయన కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్లు కంబ్లే గోపి, అజయ్, వైస్ ప్రెసిడెంట్లు విజయ్, గణేష్ కోశాధికారి సంజు, జాయింట్ సెక్రటరీలు ఉపాదే మహేష్, లక్ష్మణ్, కార్యదర్శులు రూప్, బేజు ఆర్గనైజింగ్ సెక్రెటరీ మదన్‌లాల్, గోపీచంద్, మేఘమాల, శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొత్త ఎమ్మెల్యే వంటూ ఎంపీ సెటైర్లు

బొల్లారం, మార్చి 16: కంటోన్మెంట్ రెండో వార్డు అర్జున్‌నగర్ బస్తీ బీరప్ప, హనుమాన్ ఆలయ వీధిలో బోర్డు నిధులు రూ.75 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరై పనులను ప్రారంభించారు. బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్, మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య రసాభాస జరిగింది. తమను అవమానించేలా బీజేపీ కార్యకర్తలు ప్రవర్తించారని అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ వచ్చి చాలాసేపు అయినా ఎంపీ రాకపోవడంతో కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. చాలాసేపు ఎదురుచూసిన ఎమ్మెల్యే అసహనానికి గురయ్యారు. దీంతో ఎంపీ రాజేందర్ ఎమ్మెల్యేను కొత్త ఎమ్మెల్యే మీరు కాస్త ఓపిక పట్టాలని సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


సీసీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు

పనులకు నిధులు లేవనడం సిగ్గుచేటు

చాచా నెహ్రూనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, మార్చి 16: అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి సహకారం లభించడం లేదని, నిధులు లేవంటూ కుంటి సాకులు చెపుతూ కాలయాపన చేస్తున్నారని కార్పొరేటర్ హేమలత ఆరోపించారు. ఆదివారం చాచా నెహ్రూనగర్‌లో బస్తీ సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ తాము బస్తీల్లో ప్రజలను కలవడానికి వెళ్లిన సందర్భాల్లో రోడ్లు, తాగునీరు, కొత్త డ్రైనేజీ లైన్, వీధి దీపాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం లాంటి సమస్యలు చెబుతుంటారని, అని పూర్తి చేయాలంటే నిధులు అవసరమన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి పంపిస్తే నిధులు లేవంటూ పనులు ప్రారంభించడం లేదని ఆమె అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులు వెంటవెంటనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు లేవంటూ చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలు అధికారం కట్టబెట్టింది ఇందుకేనా అని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా తాను తొమ్మిదేండ్లుగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కరిస్తున్నానని హేమలత అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, ఫహీం, జావేద్, నర్సింగ్‌రావు, వెంకటేష్, మాధవి, విజయ్‌పాల్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రముఖులకు పురస్కారాలు

పురస్కార గ్రహీతలతో పద్మశ్రీ ఉమామహేశ్వరి, ప్రతినిధులు

ముషీరాబాద్, మార్చి 16: ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఏడో వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు శ్రీధాత్రి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. పద్మశ్రీ ఉమామహేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలను అందజేశారు. హైమావతి (పర్యావరణం), డి.కావ్యరెడ్డి (ఫ్యాషన్ డిజైన్), స్వర కళ్యాణి (గాయని), కె.రాజేశ్వరి (సంగీతం), రాధిక (కూచిపూడి)కు పురస్కారాలు అందజేశారు. జర్నలిస్టులకు పురస్కారాలు అందించి సత్కరించారు. లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుదిబండి వెంకటరెడ్డి, రఘుశ్రీ, ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల్లా ఓయూ అధికారుల తీరు

సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 16: కాంగ్రెస్ కండువా కప్పుకున్న కార్యకర్తల్లా ఓయూ అధికారుల పనితీరు ఉందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ మెంబర్ హరిప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన ఓయూలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఓయూలో విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ ఉద్యమాలు చేస్తుంటే, ఆ సమస్యలను పరిష్కరించే సత్తాలేని అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తులుగా మారి ఓయూలో ధర్నాలు, నిరసనలు, ఉద్యమాలు చేపట్టొద్దని అలాంటివి అన్నీ నిషేధం అని ఉత్తర్వులు జారీ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఉత్తర్వుల పేరుతో ఏబీవీపీ నేతలు, విద్యార్థుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి ఉత్తర్వులకు భయపడేది లేదని, వెంటనే ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ఓయూ బంద్‌కు పిలుపునిచ్చారు.

సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ.. రన్

5, 10 కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న పర్యావరణ ప్రేమికులు

బేగంపేట్, మార్చి 16: గోమాత రక్షణ, ఆరోగ్యం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యాలతో మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, యోగా థెరపిస్ట్ వీరారెడ్డి ఆధ్వర్యంలో 5కే/10కే రన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్య పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, ఫిట్‌నెస్ అభిమానులు, గో సంరక్షణకారులు పాల్గొన్నారు. సహజ వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా నిర్వాహకులు వివరించారు. సహజ పద్ధతుల వల్ల మట్టిలో కార్బన్ స్థాయిని పెంచడం, 18 రకాల పోషకాలను అందించడం, పర్యావరణానికి అనుకూలంగా ఉండటం వంటి ప్రయోజనాలు కలిగి ఉంటాయని తెలియజేశారు. వీరారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం, గోమాత రక్షణ సహజ వ్యవసాయాన్ని పునరుద్ధరించేందుకు ఒక ఉద్యమంలా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ప్రకృతికి మేలు చేసే అంశాలపై అవగాహన కల్పించారు.

మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

రాకేష్ (ఫైల్)

కవాడిగూడ, మార్చి 16: మానసిక వత్తిడితో ఓ వ్యక్తి ట్యాంక్‌బండ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం సమీపంలో శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు దోమలగూడ పోలీసులకు సమాచారం రావడంతో పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తలపగిలి ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుని జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా కూకట్‌పల్లికి చెందిన గాహ్యవాడ్ రాకేష్ (43)గా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వృత్తి రీత్యా మోచీ అయిన రాకేష్ కొంత కాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని, మూడు నెలల క్రితం ఆయనకు మెడ వెనుక భాగంలో ఆపరేషన్ కావడంతో మానసిక ఒత్తిడికిగురై ట్యాంక్‌బండ్‌పై నుంచి కిందకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని ఆయన కూతురు ఆరతి(19) అనుమానం వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆరతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పూజా కార్యక్రమాలలో పాల్గొన్న బండమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు

కవాడిగూడ, మార్చి 16: కవాడిగూడ డివిజన్ పరిధిలోని బండమైసమ్మ దేవాలయం 11వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాల సందర్భంగా బండమైసమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి అర్చనలు, విశేషపూజలు జరిపారు. తెల్లవారుజామునుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బస్తీవాసులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వార్షికోత్సవాలను పురస్కరించుకొని బండమైసమ్మనగర్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాలలో బండమైసమ్మనగర్ బస్తీ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులపై నేడు నిరాహార దీక్ష

చిక్కడపల్లి, మార్చి 15: నగరంలో వివిధ హాస్టళ్లలో వంటమనిషి, కాపలాదారులు (డే అండ్ నైట్ వాచ్‌మెన్), టాయిలెట్స్ క్లీన్ చేసే వారికి మాల్ ఏజెన్సీ ద్వారా మ్యాన్ పవర్ అందజేసినా ఏజెన్సీ నుంచి రావలసిన బిల్లులు చెల్లించలేదని ఏజెన్సీ నిర్వాకుడు దోమల మల్లయ్య తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, 8వ ఫ్లోర్‌లోని కార్యాలయం ముందు నిరాహార దీక్ష దిగుతున్నట్లు పేర్కొన్నారు. 2019 జులై నుంచి 2021 సెప్టెంబర్ వరకు ఏజెన్సీకి రావాల్సిన 27 నెలల జీతాల బకాయి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత నాలుగేండ్లుగా తమకు రావలసిన బిల్లులను చెల్లించకుండా సంబంధిత సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ ఉద్దేశపూర్వకంగా బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలను సన్మానిస్తున్న సంఘం అధ్యక్షుడు సంగమేశ్వర్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 16: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోల్ల సంగమేశ్వర్ అన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్-లింగం బలిజ సంఘం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సూర్యశ్రావణి మాశెట్టి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంగమేశ్వర్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని అన్నారు. మహిళలకు వివిధ పోటీలను నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులు ప్రాదనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా శోభన్, సంఘం మహిళా విభాగం కోశాధికారి మల్లపు అశ్విని, గౌరవ అధ్యక్షురాలు లక్ష్మి, సంఘం నాయకులు జి.దినేశ్ పాటిల్, శెట్టి శివకుమార్, కల్లపల్లి రాచప్ప పాల్గొన్నారు. 23 న వీరవైశ లింగాయత్- లింగ బలిజ కుల సంఘం దశాబ్ది వేడుకల్లో భాగం ఏప్రిల్ 23 నుంచి మే 1వ తేదీ వరకు ఆర్వీఎల్ఎల్‌బీఎస్ బసవ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు పట్లోల్ల సంగమేశ్వర్ తెలిపారు. ఈ లీగ్‌లో హాల్ట్ టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఉచిత శిక్షణ తరగతులు

ఖైరతాబాద్, మార్చి 16 : ఏషియల్ ఈఎన్టీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 19న వరల్డ్ స్పాలోయింగ్ డేను పురస్కరించుకొని సోమాజిగూడలోని ఆస్పత్రి లో డైస్ఫేగియా నిర్ధారణ, చికిత్సపై 30 మంది ఆడియాలజిస్టులకు ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ తరగతులను ఈఎన్టీ వైద్యనిపుణులు డాక్టర్ చావ ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ అయిషా, డాక్టర్ నీలిమా, డాక్టర్ సంజన తదితరులు పాల్గొన్నారు.

పనికి వెళ్లివచ్చేసరికి ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, మార్చి 16: పనికి వెళ్లివచ్చేసరికి ఇంట్లో ఆభరణాలు మాయమయిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని ఇందిరానగర్‌ను ఆనుకుని ఉన్న క మలాపురి కాలనీలో హ్యాపీ కిడ్స్ స్కూల్ లో హౌజ్ కీపింగ్ పనిచేస్తున్న మేకా శ్రావణి భర్తతో కలిసి పనికోసం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చింది. ఇం ట్లో పూజ చేయాల్సి ఉండగా అల్మారాలోని ఆభరణాలు వేసుకోవడానికి చూడ గా అందులో ఉన్న 3 ఉంగరాలు, కమ్మ లు, తదితర వస్తువులు కనిపించలేదు. గత నెల 26న అల్మారాలో పెట్టిన 3తులాల బంగారు ఆభరణాలు కనిపించలే దని, రోజూ పనికి వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు బయట మిషిన్ కింద పెడ్తుంటామని, గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు తీసుకుని చోరీకి పాల్పడి ఉంటారని బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు

వెంగళరావునగర్, మార్చి 16: పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారు. రాత్రి వేళల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకుల్లోని పెట్రోల్‌ను అపహరించుకెళ్తున్నారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధి వెంగళరావునగర్ కాలనీలో అర్ధరాత్రి స్కూటీ, మోటారు సైకిల్‌పై వచ్చిన దొంగలు బైకుల్లోని పెట్రోల్‌ను బాటిళ్లల్లో నింపుకుని వెళ్తున్నారు. పెట్రోల్ తీసిన తర్వాత పైపును అలాగే వదిలేయడంతో వృథాగా రోడ్డుపై పోతుంది. ఉదయం చూసేసరికి పెట్రోల్ అంతా ఖాళీ అవుతుంది. శనివారం అర్ధరాత్రి యువకులు చోరీకి పాల్పడ్డారు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది.రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

వేసవిలో దుస్తులు, మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న స్కై ఫౌండేషన్ ప్రతినిధులు

బన్సీలాల్ పేట్, మార్చి 16: రోడ్ల పక్కన జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు దుస్తులు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్స్ అందించి వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని అన్నారు. ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్నదని, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నగర ప్రధాన కూడళ్లు, బస్ స్టాండ్లలో చల్లని మంచి నీరు అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమములో సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.